# నిజాలు - నీడలు

రావినూతల సువర్ణ కన్నన్



చినుకుతో ప్రారంభమైన వర్షం కుంభవృష్టిగా మారింది! తాతలనాటి రెండు గదుల పెంకుటిల్లు వానకి తడిసిపోయి చితచితలాడుతోంది.

ఇంటి కప్పుమించి ధారగా పడుతున్న చోట్ల చెంబులు, గిన్నెలు పెట్టి లోపలున్నవి తడవకుండా వుండాలని తెగ తాపత్రయపడుతోంది శాంత.

పొడిగా వున్న ఓ మూలగా మంచాన్ని లాక్కుని ముడుచుకు పడుకున్న శాస్త్రిగారు కురిసే తన ఇంటినీ, తన మార్గాన్ని కాదని ఇంగ్లీషు చదువులకెగబడి, గ్రాడ్యుయేటయినా ఉద్యోగం లేక చివరికి ఓ పచారీ కొట్లో గుమాస్తాగా స్థిరపడి బ్రతుకుని గానుగెద్దులా యీడ్చుకొస్తున్న కొడుకుని తిట్టిపోస్తున్నాడు.

ఈ తిట్లకి అలవాటుపడిపోయిన శాంత అవేం పట్టించుకోకుండా భర్తకోసం ఆతృతగా ఎదురుచూస్తోంది.

వానకి గాలి కూడా తోడవడంతో ప్రకృతి భయంకరంగా వుంది.

శాంతలో కంగారెక్కువై పోతోంది. పిచ్చిదానిలా ఇంట్లోకీ, వీధిలోకీ తిరుగుతూనే వుంది.

రాత్రి పదకొండు దాటింది. శాంత భర్త శంకరం రాలేదు.

మూడేళ్ళ పాప తాతగారి పక్కలోనే పడుకుని కలవరిస్తోంది! దానికి సాయం ముసలాయన గొణుగుడు! మతిపోయేలా వుంది శాంతకి.

'పొద్దున్ననగా ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిన ఆయన ఇంతసేపు ఎక్కడున్నట్లు?.... ఈ వాన కెక్కడైనా బిగిసిపోయారా?.... లేక ఈ దారిద్ర్యానికి భయపడి ఏ అఘాయిత్యానికైనా పాల్పడలేదు కదా' అన్న ఆలోచన రాగానే భయంతో ఒణికిపోయింది.

మళ్ళీ తన ఆలోచనలకి తన్ని తానే తిట్టుకుంటూ భర్త ఇల్లు త్వరగా చేరాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది!

వాన ఉధృతం కాస్త తగ్గింది.

శాంత మళ్ళీ ఆశగా వీధి అరుగుమీది కెళ్ళి చూసింది.

ఆమె కళ్ళు తళుక్కుమన్నాయి.

అల్లంత దూరంలో పూర్తిగా తడిసిపోయి గబగబా నడిచి ఒస్తున్న భర్తని చూసి తేలిగ్గా ఊపిరి తీసుకుంది.

శంకరం వచ్చి బట్టలు మార్చుకుని టవల్‌తో తల తుడుచుకుంటూ—

"పాప పడుకుందా?" అన్నాడు ఏదో అడగాలన్నట్టు.

"ఆ! భోంచేద్దాం రండి!" అంది శాంత.

"వెళ్ళిన పని ఏమైంది?" అని అడగాలనుంది ఆమెకి. కానీ.... భర్త మొహం చూశాక అడగబుద్ధి కాలేదు.

శంకరం భోజనాని కూర్చున్నాడు.

భర్త చెప్తాడని శాంత, భార్య అడుగుతుందని శంకరం ఎదురు చూస్తూ మౌనంగా భోజనం అయిందనిపించారు.

ఇల్లంతా ఓసారి పొడిగుడ్డ పెట్టి తుడిచి పొడిగా వున్న చోట పక్కలు పరిచింది శాంత.

భారంగా పక్కమీది కొరిగాడు శంకరం.

"మీ ఫ్రెండ్స్‌ని అడిగారా?" పది నిమిషాల తర్వాత మెల్లిగా అడిగింది శాంత.

"అడిగాను శాంతా!.... కానీ, ఎక్కడా పైసా పుట్టలేదు!" బాధగా అన్నాడు శంకరం.


"పోనీ.... మీ సుబ్బయ్యశ్రేష్టిగార్నే బతిమాలక పోయారా?"

పేలవంగా నవ్వాడు శంకరం.

"అదీ అయింది శాంతా!.... ఎన్నడూ లేంది ఇంతెత్తున ఎగిరిపడ్డాడు!....'ఇలా డబ్బు కోసం ప్రాణం తీస్తే.... ఇంక సరుకులు కూడా అరువిచ్చేది లేదు!' అని నిర్మొహమాటంగా చెప్పేశాడు!" అన్నాడు.

"అవున్నా!.... ఎందుకు చెప్పడూ!.... బ్రాహ్మణీకానికో గౌరవం ఏడిస్తేకదూ?... అందుకే. నాలుగు సంస్కృతం ముక్కలు చదువేడవరా అన్నాను! నా మాట విన్నావా? ఉహూ! ఆ ఇంగ్లీష్ చదువుల మోజులో పడ్డావ్. ఏమైందిప్పుడూ? తిండానికి తిండి. కట్టడానికి బట్టకూడా కరువైంది. నిజానికి నా ఆరోగ్యం బావుండి నేను పౌరోహిత్యం చేసేటప్పుడు ఎంత వైభోగంగా వుండేది. ఒక్క గుడ్డముక్క కొనేరుగుదునా? అంతెందుకు ఈ సుబ్బయ్యశ్రేష్టే ఎంత వినయంగా ఉండేవాడు? ఎన్నిదణ్ణాలు పెట్టేవాడు? అంతా నా దురాశ!" మంచంలోంచే సహస్రం చదివారు శాస్త్రిగారు.

అయినా అవేం అంతగా వినిపించడం లేదు శంకరానికి.




కానీ.... మధ్యాహ్నం కాబూలీవాలా వీధిన పడి తిట్టిన తిట్లే.... చెవుల్లో ప్రతిధ్వనించి ములుకుల్లా గుచ్చుకుంటున్నాయి.

నాలుగు నెలల క్రితం శంకరం కూతురికి ప్రాణం మీదికొస్తే ఎక్కడా అప్పు దొరక్క. గత్యంతరం లేక ఓ కాబూలీవాలా దగ్గర వంద రూపాయలు తీసుకున్నాడు.

పాప ఆరోగ్యం బాగుపడింది! కానీ బాకీ మాత్రం తీరలేదు.

ప్రతినెలా పది రూపాయలు వడ్డీ మాత్రం ఇస్తూ వచ్చాడు. కానీ అసల్లో పైసా అయినా తీర్చలేకపోయాడు.

వడ్డీ మాత్రం ఇస్తూంటె చాలు అసలు ఎంతకాలం ఇవ్వకపోయినా ఫరవాలేదు అని అతడు విన్నమాట అబద్ధం అని మధ్యాన్నం కాబూలీవాలా ఇంటికొచ్చి అడిగినప్పుడు తెలిసింది తనికి.

పది రోజుల్లో పూర్తిగా ఇచ్చేస్తానని నచ్చచెప్పి ఆ కాబూలీవాలాని పంపేసరికి అతనికి తలప్రాణం తోకకొచ్చినట్లయింది.

ఆ డబ్బుకోసం అడిగిన వాళ్ళనడక్కుండా. తిరిగినచోటు తిరక్కుండా తిరుగుతూనే ఉన్నాడు. అయినా అతనికి పైసా పుట్టలేదు.

'ఛ! నాకన్నా రిక్షావాడు నయం. హాయిగా సంపాయించుకుని పెళ్లాం బిడ్డల్ని పోషించుకుంటున్నాడు' అనుకుంటూ తనని తాను తిట్టుకుంటున్నాడు.

వాన పూర్తిగా తగ్గిపోయింది.

శాస్త్రిగారు. పాప గాఢనిద్రలోకి వెళ్ళిపోయారు. శంకరం నిద్ర నటిస్తున్నాడు. శాంత ఇంటికప్పుకేసి చూస్తూ పడుకుంది.

ఇద్దరి మనసుల్లోనూ పురుగులా తొల్చే విషయం 'ఈ గండం ఎలా గడుస్తుందా' అని!

తాకట్టుపెట్టడానికి గానీ. అమ్మడానికి గానీ తులం వెండిగానీ. ఒన్నం బంగరంగాని ఆ ఇంట్లో లేవని ఆ ఇద్దరికీ తెలుసు,

దూరంగా పోలీస్టేషన్‌లో నాలుగ్గంటలు కొట్టారు.

హఠాత్తుగా శాంతకో ఆలోచన వచ్చింది. వెంటనే భర్తని లేపి చెప్పింది.

ముందు తెల్లబోయి తర్వాత తల అడ్డంగా ఊపాడు శంకరం. భార్య ఆలోచన ఏమాత్రం నచ్చలేదు శంకరానికి.

భార్యాభర్తలిద్దరూ తర్జనభర్జనపడి చివరికి ఒక నిర్ణయాని కొచ్చారు, తెల్లారేసరికి.

అదే ...శాంత ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకోవడం! ఆపరేషన్ చేయించుకుంటే....నూటపది రూపాయలిస్తారు. అది పెట్టి అప్పు తీర్చేయవచ్చు!

.... ............

"శాంతా!.... మరోసారి బాగా ఆలోచించుకో" మెల్లిగా అన్నాడు శంకరం.

శాంత నవ్వింది.

"ఇందులో ఆలోచించడానికేముంది?"

"కానీ....నీకు మగపిల్లలంటే ఎంత ఇష్టమో నాకు తెలియదనుకున్నావా? అందుకే...."

"సార్! మనకున్న ఎస్టేట్‌కి ఈ ఒక్క పాప చాలు!...." మళ్ళీ నవ్వింది శాంత.

"కానీ...."

"ఇదిగో! మీరు మళ్ళీ మొదటికి రాకండి! అంతగా కొడుక్కావాలనుకుంటే మన పాప పెద్దయ్యాక పెళ్ళిచేసి దానికొక్కొడుకు పుడితే వాణ్ణి మనం పెంచుకుని మన స్థిర. చరాస్తులన్నీ వాడికిచ్చేద్దాం!" కళ్ళు వర్షిస్తున్నా "పెదవులతో" నవ్వుతూ అంది శాంత.

ఆ నవ్వు కేవలం పెదవులమీది నించేనని. అదీ తన తృప్తి కోసమే అనీ శంకరానికి తెలుసు! అయినా నిస్సహాయంగా చూస్తూ భారంగా నిట్టూర్చాడు.

.... .... .... .... .... ....

అనుకున్నట్టు ఆ రోజు కాంతకి ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగిపోయింది!

శంకరం ఏదో తప్పు చేసినట్టు ఫీలవుతుంటే కాంతే అతన్ని మందలించి ధైర్యం చెప్పింది.

కంట కన్నీరు కాదుకదా. కనీసం కించిత్ బాధయినా కనబర్చని భార్యకేసి ఆశ్చర్యంగా ఆరాధనగా చూశాడు శంకరం.

వంశాంకురం పుట్టకుండానే ఆపరేషన్ చేయించుకున్నందుకు తిట్టిపోశాడు శాస్త్రిగారు!

"భగవంతుడిచ్చిన ఫలాన్ని కాదంటానికి మనమెంతటివారం" అన్నాడు.

"విధాత సృష్టికే ఆటంకం కలిగించినవాళ్ళు అధోగతి పాలౌతారని" శపించాడు.


"వెధవాపరేషన్లు!...." అంటూ హాస్పిటల్ని. డాక్టర్లనీ దుమ్మెత్తిపోశాడు.


అన్నింటికీ మౌనమే జవాబు అన్నట్టుండిపోయాడు శంకరం.

కాబూలీవాలా దగ్గరికెళ్ళి ఫలానా రోజున డబ్బు ఇస్తానని చెప్పాడు.

అతనికి కొంత బాధగా వున్నా ఋణవిముక్తుణ్ణవుతాననే తృప్తిగా కూడా వుంది.

.... .... .... .... .... ....




ఆ రోజే కాంతని డిశ్చార్జ్ చేసేది! సుబ్బయ్య శ్రేష్ఠిగార్నడిగి పర్మిషన్ తీసుకుని భార్యని తీసుకురావడానికి హాస్పిటల్‌కెళ్ళాడు శంకరం.

కాంత పది నిమిషాల క్రితమే పక్కింటి ఇల్లాలితో కలిసి ఇంటికెళ్ళిపోయిందని తెలుసుకున్న శంకరం గబగబా ఇంటి వైపు నడిచాడు.

వీధి తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. మెల్లిగా తలుపులు తోసుకుని లోనికొచ్చాడు.

తండ్రి మాగన్నుగా పడుకుని నిద్రపోతున్నాడు.

కూతురు లక్కపిడతలు పెట్టుకుని ఆడుకుంటూ తండ్రి రావడంతో ఓసారతనికేసి చూసి తిరిగి ఆటలో పడిపోయింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది!

ఆశ్చర్యంగా. 'గది' అనబడే తడిక దాటుకు తొంగిచూశాడు శంకరం.

కాంత గోడవైపు మొహం పెట్టుకుని పడుకుని ఉంది.

"కాంతా!" మెల్లిగా పిల్చాడు.

కాంత పలకలేదు.

"అరె! అప్పుడే నిద్రపోతున్నావా!" లోనికొస్తూ అన్నాడు శంకరం.

ఈ సారీ కాంత పలకలేదు.

"కాంతా!" కంగారుగా తట్టిలేపాడు.

"ఊఁ!" అని మాత్రం అందోసారి కాంత.

"ఏవిటి కాంతా!.... ఒంట్లో బాగాలేదా?" భార్యని ఇటుకేసి తిప్పుతూ అన్నాడు శంకరం.

చిత్రం!....ఆమె కళ్ళు ఇంతలావు వాచి వున్నాయి.

భార్య బాగా ఏడ్చిందని గ్రహించిన శంకరం మనసంతా జాలితో నిండిపోయింది.

"కాంతా!.... ఏడ్చావా?" ఆమె పక్కలో కూర్చొని కళ్ళు తుడుస్తూ అన్నాడు.

కాంత మాట్లాడలేదు. కనీసం కళ్ళు కూడా తెరవలేదు. దుఃఖం మాత్రం రెట్టింపయింది.

"ఛ! ఛ! ఏమిటి కాంతా!.... ఇన్నాళ్ళూ నాకు ధైర్యం చెప్పి ఇప్పుడు నువ్వు బాధ పడుతున్నావా? పాప చూసిందంటే షేమ్ షేమ్ అంటుంది...." అనునయంగానూ, తమాషాగానూ అన్నాడు శంకరం.

కాంతలో దుఃఖం కట్ట తెంచుకుంది.

చటుక్కున భర్త ఒళ్ళో మొహం దాచుకుని భోరుమంది.

బిత్తరపోయిన శంకరానికేం చెయ్యాలో తోచలేదు. క్షణం ఆలోచించాడు.

ఇన్నేళ్ళలో ఆమె ఇంత బేలగా ఏనాడూ కనిపించలేదు. కానీ ఈ రోజు.... తన అసమర్థత మూలంగా.... ఆమె మనసుకి మానని గాయం అయింది!.... కానీ ఇప్పుడేం చెయ్యగలడు?.... సమయం మించిపోయింది! ఇప్పుడు తను చెయ్యవలసిందల్లా.... ఆమెకి ధైర్యం చెప్పి.... ఓదార్చడం!.... అని నిశ్చయించుకుని బలవంతంగా నవ్వుతూ—

"ఏయ్! ఏయ్! ఏయ్! ఏమిటిది.... ఇదంతా మగ నలుసు కోసమే?.... పిచ్చి శాంతీ!.... ఆడపిల్లలకన్నా మగపిల్లలేం వుద్ధరిస్తారు చెప్పు!.... అంతగా కావాలనుకుంటే.... మన మనవణ్ణి దత్తత చేసుకుని.... అదే మన పాప కొడుకుని. పెంచుకుని మన ఎస్టేట్స్ అన్నీ.... వాడికిచ్చేద్దామనుకున్నాం కదా.... ఇంకా ఈ బాధెందుకు?" అన్నాడు.

శాంత నవ్వలేదు.

ఏడుపు ఆపనూ లేదు.

బిత్తరపోయిన శంకరం.... కొంతసేపలా మౌనంగా వుండిపోయాడు.

దుఃఖాతిశయం కాస్త తగ్గాక.... మెల్లిగా దిండుకిందనించి ఏదో తీసి భర్త చేతిలో పెట్టి గుప్పెటమూసింది శాంత.

మూసిన గుప్పెటని విప్పి చిత్రంగా చూసుకున్నాడు శంకరం.

పదిహేను రూపాయలు. చిల్లర!

"ఏమిటిది?" ఆశ్చర్యంగా అన్నాడు.

"నేను ఆపరేషన్ చేయించుకున్నందుకు ప్రతిఫలం!" గద్గద స్వరంతో అంది శాంత.

"అంటే?...."

"ఏముందీ!....ఆపరేషన్ చేసిన డాక్టర్‌కి ఇరవై అయిదు రూపాయలు. నర్స్‌కి పదిహేను రూపాయలు. ఆయా, వార్డ్‌బాయ్ లాంటి వారికి తలా పది. థియేటర్లో ఉండగా ఏవో మందులవసరమై వారి దగ్గర లేక బైట తెప్పించారట, వాటికి పది రూపాయలు....అన్నీ పోను.... ఇదిగో ఈ పదిహేను రూపాయల ముప్ఫయి పైసలు మిగిలాయట! చేతిలో పెట్టారు" ఆవేశంగా అంది శాంత.

కొయ్యబారిపోయాడు శంకరం.

"ఏమిటీ.. నూటపది రూపాయలిస్తామని చెప్పి పదిహేను రూపాయలిచ్చారా?" తెల్లబోతూ అన్నాడు.

"అవును!.... అంతే కాదు!.... ఇదేమిటన్యాయం?.... అంటే ఏమన్నారో తెలుసా?...." ఒణుకుతున్న గొంతుతో అంది శాంత.

"ఏమన్నారు?" తడారిన గొంతుతో అన్నాడు శంకరం.

"మేమిచ్చిన డబ్బు మాకివ్వడానికే ఏడుసావేంటి.... ఏదో నీ ఇంట్లో సొమ్ము తెచ్చి మాకు దానం చేస్తున్నట్లు అన్నారు."

"చూశారా....నేతిబీరకాయ లోని నెయ్యిలా.... ధర్మాసుపత్రిలో ధర్మం ఎన్నిపాదాల నడుస్తోందో!"

బాధ. కోపం. కసి. దుఃఖం. చేతకానితనం అన్నీ కలిసిన గొంతుతో....తడబడుతూ అంది శాంత.

అయితే ధర్మాసుపత్రిలోని ధర్మం సంగతిగానీ. లోకంలో జరిగే అవినీతి. లంచగొండి తనాల గురించి గానీ....అతని మనసు ఆలోచించడం లేదు!

'రేపొద్దున్న కాబూలీవాలా వస్తాడు! అతనొస్తే ఏం సమాధానం చెప్పాలి?....అతను యాగీ చేస్తే తనని తానెలా కాపాడుకోవాలి?' అనుకున్న శంకరం రెండు చేతులతో తల పట్టుకుని కుప్పకూలిపోయాడు!




# "తరతరాలుగా మా కుటుంబంలో అందరం అయొడెక్స్‌నే నమ్ముకున్నాం..." అంటున్నారు గుమ్మడి.

నొప్పా? బెణికిందా? కండరాలు పట్టాయా? కీళ్ళు పట్టాయా? వీటన్నిటినీ నయం చేసేది అయొడెక్స్. నొప్పిని తగ్గించడం అన్నది అయొడెక్స్ యొక్క లక్షణం. అయొడెక్స్‌ని రుద్దుతుండగానే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. లోపల, రుగ్మతగల పొరలు నయం కావడానికి మందంతా లోపలికి చొచ్చుకు పోయేందుకు అయొడెక్స్‌ని బాగా రుద్దండి. బాధ తగ్గినా కూడా అదే విధంగా అయొడెక్స్‌ని పదేపదే రాస్తూ వుండండి.

| | అయొడెక్స్ |
|---|---|
| ధాతువు (లోపలి పొర) దెబ్బతినడం | ✓ |
| నొప్పులు | ✓ |
| బెణకడం | ✓ |
| కీళ్ళు పట్టడం | ✓ |
| కండరాలు పట్టడం | ✓ |
| నడుం నొప్పి | ✓ |




## అయొడెక్స్®

మిమ్మల్ని మళ్ళీ చురుకుగా పనిచేసేలా చేస్తుంది.

LINTAS IODEX 71 232 TL